# మెట్రో రెండోదశకు ఓకే



- విస్తరణకు రూట్‌మ్యాప్ ఖరారు చేసిన ప్రభుత్వం
- 70 కిలోమీటర్ల మార్గం నిర్మించేలా ప్రణాళికలు
- 29 కిలోమీటర్లతో నాగోలు-ఎయిర్‌పోర్టు కారిడార్
- మైలార్‌దేవ్‌పల్లి నుంచి ప్రతిపాదిత హైకోర్టు వరకు
- రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు
- మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు పొడిగింపు
- పాతబస్తీ మార్గం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- మరో 3 నెలల్లో డీపీఆర్‌లు: ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు రూట్ మ్యాప్ ఖరారైంది. సుమారు 70 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకోసం గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన పాత ప్రణాళికలను రద్దు చేసి.. నూతన ప్రణాళికలకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫేజ్-2 విస్తరణకు రూట్ మ్యాప్‌ను అధికారులు రూపొందించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టును, నూతనంగా హైకోర్టు భవనం నిర్మించే రాజేంద్రనగర్‌ను కూడా కలుపుతూ నగరం నలుమూలలను అనుసంధానం చేసేలా ఈ రూట్ మ్యాప్‌ను తయారు చేశారు. దీని ప్రకారం.. మెట్రో రెండో దశలో కారిడార్-2 కింద పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్లు, ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు వరకు 15 కిలోమీటర్ల మేర నూతన మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక కారిడార్-4 సూపర్‌లైన్‌లో

మిగతా 10వ పేజీలో...

# మెట్రో రెండో దశకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

షైలార్‌దేవపల్లి- ఆరాంఘర్, రాజేంద్రనగర్ వద్ద ప్రతిపాదించిన నూతన హైకోర్టు స్థలం వరకు మెట్రో సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇదే కారిడార్ కింద.. నాగోలు నుంచి ఎల్బీనగర్‌కు, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు, షైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు 29 కిలోమీటర్ల మేర నూతన మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక కారిడార్-5లో రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర నూతన మార్గాన్ని ప్రతిపాదించారు. కారిడార్-6లో మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు 14 కిలోమీటర్ల మేర నూతన మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు.

## 47 రోజుల్లోనే అమల్లోకి ప్రణాళిక..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 47 రోజుల్లోనే మెట్రో రెండో దశ ప్రణాళికను అమల్లోకి తెచ్చింది. మెట్రో మొదటి దశలో రూ.14,132 కోట్లతో 72 కిలోమీటర్ల పనులను ప్రతిపాదించగా.. 69.2 కిలోమీటర్లను పూర్తిచేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన పనులను 2017లో పూర్తి చేశారు. ఎల్బీనగర్- మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం కారిడార్లలోని 57 స్టేషన్ల గుండా ప్రతిరోజూ 1028 సర్వీసులను నడిపిస్తున్నారు. ఈ మేరకు రోజుకు సగటున 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది వరకు ప్రయాణిస్తున్నారు. అయితే నగరంలో జనాభా రోజురోజుకూ పెరిగిపోతున్న తరుణంలో మెట్రో విస్తరణపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రెండో దశ కింద రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు (31 కిలోమీటర్లు), బీహెచ్ ఈఎల్-లక్డీకాపూల్ మధ్య (26 కిలోమీటర్లు), నాగోలు- ఎల్బీనగర్ మధ్య (5 కిలోమీటర్లు) పను లు ప్రతిపాదించారు. ఇందులో రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు పనులను ప్రభుత్వమే సొంతంగా చేపడతామని ప్రకటించి రూ.6,250 కోట్లను మంజూరు చేసింది. పనులకు సంబంధించి 2022 డిసెంబర్ 9న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టర్ ఎంపికలో జాప్యం జరగడం, ఈలోగా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి ప్రభుత్వం మారడంతో పనులకు బ్రేక్ పడింది.




## ప్రజా రవాణాకు పెద్దపీట..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో రెండో దశ పనుల్లో కొంతభాగం రియల్టర్లు, రాజకీయ నాయకులకే ప్రయోజనం చేకూరేలా ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఇలా కాకుండా.. ప్రజా రవాణాకు ఆమోదయోగ్యమైన మార్గంలో మెట్రోను విస్తరిస్తామని నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు గత డిసెంబరు 7న పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత 13న మెట్రో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎయిర్‌పోర్టు మార్గాన్ని రాయదుర్గం నుంచి కాకుండా పాతబస్తీ నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా మళ్లించే విధంగా ఆలోచించాలని సూచించారు. ఈ నెల 2న మరోసారి మెట్రో విస్తరణపై చర్చించారు. పాతబస్తీ నుంచి ఎల్బీనగర్ మీదుగా సవరించిన ఎయిర్‌పోర్టు అలైన్‌మెంట్ కోసం ట్రాఫిక్ అధ్యయనాలు, డీపీఆర్‌లను త్వరగా పూర్తి చేయాలని, లక్ష్మీగూడ-జల్‌పల్లి-మామిడిపల్లి స్ట్రెచ్‌లో మెట్రోలో కొంత భాగాన్ని వేసే విషయంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. సీఎం సూచించిన మార్గాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన అధికారులు రూట్‌మ్యాప్‌ను ఇటీవల అందించగా.. ప్రభుత్వం దానికే ఆమోదముద్ర వేసింది. ఏడు మార్గాల్లో 70 కిలోమీటర్ల పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## కొత్త రూట్‌మ్యాప్ ఇదే..

**కారిడార్-2:** ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు (5.5 కిలోమీటర్లు)

**కారిడార్-2:** ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్డు వరకు(1.5 కిలోమీటర్లు)

**కారిడార్-4:** నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వరకు, అక్కడి నుంచి చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్డు, షైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు.(29 కిలోమీటర్లు)

**కారిడార్-4:** షైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు (4 కిలోమీటర్లు)

**కారిడార్-5:** రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి బయోడైవర్సిటీ జంక్షన్, నానక్‌రాంగూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) వరకు.(8 కిలోమీటర్లు)

**కారిడార్-6:** మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు(14 కిలోమీటర్లు)

**కారిడార్-7:** ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హాయత్‌నగర్ వరకు (8 కిలోమీటర్లు)

## నగరం నలుమూలలకూ మెట్రో..

*నగరంలో మొదటి దశలో ఇప్పటికే 69.2 కిలోమీటర్ల మార్గంలో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. అయితే వీటికి అనుసంధానంగా రెండో దశలో ప్రతిపాదించిన పనులను పూర్తి చేయడం ద్వారా నగరం నలుమూలలా మెట్రో రవాణా ఏర్పడే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు నాగోలు-ఎల్బీనగర్ రూట్‌ను కలపడం ద్వారా అటు రాయదుర్గం నుంచి, మియాపూర్ నుంచి రాకపోకలు సులువుగా ఉంటాయి. అలాగే ఎల్బీనగర్-వనస్థలిపురం-హాయత్‌నగర్ వరకు, పాతబస్తీ నుంచి వయా చాంద్రాయణగుట్ట మీదుగా రైలును తీసుకెళ్లడంతో పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కొత్తగా షైలార్‌దేవ్‌పల్లి నుంచి ప్రతిపాదిత హైకోర్టు వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించడంతో మెట్రో శివారు వరకు చేరుతోంది. ఇదిలా ఉండగా, కొత్త మెట్రో డీపీఆర్‌ల తయారీ శరవేగంగా జరుగుతోందని, మరో మూడు నెలల్లో డీపీఆర్‌లు సిద్ధం చేస్తామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.*